క్లుప్తంగా

ముగిసిన విశ్వకర్మ యజ్ఞోత్సవాలు



పోతులూరి విగ్రహాన్ని నిమజ్జనం కోసం తీసుకువెళ్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక సినిమా రోడ్డు సంత చెరువు వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞోత్సవం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారిని నగర వీధులలో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఆలయ గౌరవ సలహా సంఘ సభ్యుడు చెల్లూరి సత్యనారాయణ మాట్లాడుతూ కుల వృత్తులను ప్రోత్సహించి బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ముక్కామల మూర్తి, ప్రధాన కార్యదర్శి తేలాసుల శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో అన్ని రోగాలూ నయం



రోగులను పరీక్షిస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి దివ్య

కరప: ఆయుర్వేద ఔషధాలతో అన్ని వ్యాధులూ నయమవుతాయని డాక్టర్ బి.దివ్య అన్నారు. 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశమందిరంలో ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆయుర్వేదంలో సైతం ఇప్పుడు మాత్రలు, గొట్టాలు, టానిక్‌ల రూపంలో మందులు వచ్చాయన్నారు. మండలంలోని గురజనాపల్లి గ్రామంలో ఆయుర్వేద ఆసుపత్రి ఉందని, దీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాని మోదీ ఏటా సెప్టెంబర్ 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించాలని ప్రకటించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పలువురు రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ భవానీశంకర్, పేకేటి దుర్గాప్రసాద్, ఎంఎస్‌ఓ ఎన్ఎస్ కృష్ణమూర్తి, యోగా శిక్షకులు ఎ.బాబ్జీ, పి.లోవరాజు పాల్గొన్నారు.

లయన్స్ జెమ్స్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



లయన్స్‌జెమ్స్ క్లబ్ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి

బోట్‌క్లబ్: లయన్స్‌క్లబ్ జెమ్స్ కాకినాడ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక టౌన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా దేవత నరసింహమూర్తి, కార్యదర్శిగా మద్దింశెట్టి రామారావు, కోశాధికారిగా లింగమల్లు శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి, సీనియర్ సభ్యులు డీవీఎస్ రాజు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి లయన్స్ జిల్లా గవర్నర్ వి.కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, వీఎస్ శర్మ, టి.లక్ష్మారెడ్డి, ఎస్.ప్రభుదాస్, ఎస్.మణిబాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి



ఉప్పలంకలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: పర్యావరణానికి ముప్పును కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. మండలం ఉప్పలంకలో మంగళవారం ఆయన పర్యటించి పంచాయతీ, సచివాలయం సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. తర్వాత ఆయన పంచాయతీ సిబ్బందితో ప్రజలను కలసి తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వడంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, కార్యదర్శి ఎం.భవాని, బొమ్మిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌పై దాడులు

కాకినాడ రూరల్: వాకలపూడి ఫిషింగ్ హార్బర్‌లో పెట్రోల్ బంక్‌పై మంగళవారం నాలుగు శాఖల అధికారులు దాడులు చేశారు. లైసెన్స్ లేకుండా బంక్ నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్, తూనికలు కొలతలు, సివిల్ సప్లయిస్, వాణిజ్య పన్నుల శాఖల అధికారులు శ్రీ అయ్యప్ప ట్రేడర్స్ బంక్‌పై దాడులు చేశారు. శాంపిల్స్ సేకరించి, రికార్డులు పరిశీలించారు. తాము మెరైన్ ఫ్యూయల్ విక్రయిస్తున్నామని దీనికి లైసెన్స్ అవసరం లేదని నిర్వాహకుడు తెలియజేయడంతో అధికారులు జీవోలు రప్పించి పరిశీలిస్తున్నారు. పెట్రోల్ ఉత్పత్తులు ఉండే కేసు కోణంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలు విక్రయాలు నిలిపివేశారు.

సెస్సు.. ఇదో న్యూసెన్సు!

- గ్రంథాలయాల పేరు చెప్పి వసూళ్లు
- అప్పనంగా ఇతర పద్దులకు వినియోగం
- గ్రంథాలయ సంస్థకు రూ.కోట్లలో బకాయి
- కాకినాడ కార్పొరేషన్ చెల్లించాల్సిందే రూ.8.5 కోట్లు



జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం

బాలాజీచెరువు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఇటీవలే కానిస్టేబుల్, ఉపాధ్యాయ ఉద్యోగాలతో పలు ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు ఎందరో ఉన్నారు. ఎందరో పాఠకుల జీవిత గమనంలో ఎంతో సహకరించిన గ్రంథాలయాల అభివృద్ధికి సెస్సు వసూలు కాకపోవడం ప్రతిబంధకమవుతోంది. స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న సెస్సు గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా అభివృద్ధి పనులు, వసతులు, సౌకర్యాలు కల్పించే వీలుంటుంది. గ్రంథాలయాలకు వచ్చే వారంతా నిరుద్యోగులు, పోటీ పరీక్షల సామగ్రి, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే సెస్సు నిధులు అందనందున అధికారులు దీనిపై స్పష్టమైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఫలితంగా గ్రంథాలయాలు నీరసించిపోతున్నాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మున్సిపల్, కార్పొరేషన్లు గ్రంథాలయ సెస్సును ఈ సంస్థకు జమ చేయకపోవడంతో బకాయిలు లక్షల్లో పేరుకుపోతున్నాయి. ఎన్నిసార్లు అధికారులు మొరపెట్టుకున్నా చర్యలు మాత్రం శూన్యం. నగరంలో గ్రేడ్–1 రెండు, గ్రేడ్ –2 గాంధీనగర్, శ్రీనగర్, గ్రేడ్ –3 జగన్నాథపురం, గ్రేడ్–4 రామకృష్ణారావుపేటలో గ్రంథాలయాలు ఉండగా పుస్తక నిక్షిప్త కేంద్రాలు (బీడీసీలు) 5 వరకూ ఉన్నాయి. బీడీసీ నిర్వహణకు ఒక్కొక్కదానికి ప్రతి నెలా రూ.1500 సంస్థ చెల్లించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.4 వేలు పెంచి బీడీసీలకు మరింత చేయూతనిచ్చారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిలో నూటికి రూ.8 రూపాయలు సెస్సు రూపంలో వసూలు చేస్తారు. పన్నులు వసూలు చేసేటప్పుడు గ్రంథాలయ సెస్సు వసూలు చేసి వాటిని తిరిగి జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలి. అయితే సెస్సు వసూలు ఏటా ప్రజల నుంచి వసూలు చేస్తున్నా వాటిని గ్రంథాలయాలకు చెల్లించకపోవడం వల్ల ఆ మొత్తం దాదాపుగా రూ.16 కోట్లు బకాయి ఉండగా కాకినాడ కార్పొరేషన్ నుంచి రూ.8.66 కోట్ల వరకూ బకాయి ఉంది.

రూ.50 లక్షలు చెల్లించారు



కాకినాడ కార్పొరేషన్ నుంచి ఇటీవలే రెండు రోజుల క్రితం జాయింట్ కలెక్టర్ చొరవతో రూ.50 లక్షలు చెల్లించారు. ఇంకా రూ.8 కోట్లకు పైగా బకాయి ఉంది. గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్సుపై ఆయా స్థానిక సంస్థలకు నోటీసులు చెల్లిస్తున్నాం. దీనిపై ఏ విధమైన సమాధానం రావడం లేదు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులో ఏటా గ్రంథాలయ వాటా సక్రమంగా తమకు చెల్లిస్తే కోట్ల స్థాయిలో బకాయిలు ఉండవు. గ్రంథాలయాల్లో మెరుగైన సదుపాయాలు, సౌకర్యాల కల్పనకు నిధులు అవసరం ఉంది.

– సీహెచ్ వెంకటరావు, ఇన్‌చార్జ్ కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ

గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలి



ప్రజాప్రతినిధులు, ఉన్నత అధికారులు దృష్టి సారించి గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకోవాలి. ప్రజల నుంచి పన్ను వసూలు చేసి గ్రంథాలయాల వాటా చెల్లించక పోవడం బాధకరం. దాదాపు పదేళ్ల నుంచి కార్పొరేషన్ బకాయి చెల్లించకుండా ఏదో మొక్కుబడిగా చెల్లిస్తుంది. సెస్సు బకాయి పూర్తి స్థాయిలో చెల్లించాలి.

– కె.సాయిబాబు, అధ్యక్షులు, గోదావరి లైబ్రేరీ అసోషియేషన్ కాకినాడ

ఓటర్ల జాబితా సక్రమంగా ఉండాలి

బోట్‌క్లబ్: మంచి ప్రభుత్వం ఏర్పడాలంటే దేశ భక్తి కలిగిన సాధారణ వ్యక్తులు సైతం పోటీ చేయగలగాలని, ఓటర్ల జాబితాలు సక్రమంగా ఉంటేనే ఎన్నికల ఫలితాలు సజావుగా ఉంటాయని పౌర సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. స్థానిక జవహర్ వీధి వివేక్ భవన్‌లో సామాజిక సమాలోచన వేదిక ఆధ్వర్యంలో పౌర సంఘం సమావేశం మంగళవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయలను తెలియజేశారు. ఆధార్ నమోదుతో కాకుండా ఆధార్ అనుసంధానంతో ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. దేశంలో ఒకరికి ఒకచోట మాత్రమే ఓటు నమోదు ఉండాలన్నారు. ఆధార్ అనుసంధానంతోనే దొంగ ఓట్ల నివారణ డబుల్ ఓటు నమోదు నియంత్రణ సాధ్యం కాగలదన్నారు. ఈవీఎంలు ఎన్నికల ఫలితాలలో అభ్యంతరాలు ఉంటే వీవీప్యాట్ రశీదులు లెక్కించే ప్రక్రియకు సవాల్ చేసిన పోటీ అభ్యర్థి నుంచి లెక్కింపునకు అయ్యే వ్యయాన్ని నిర్ణయించి ముందుగా జమ చేయించే సంస్కరణలు అమలు కావాలన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, కమిషనర్ అధ్యక్షతన ఎన్నికల కమిషన్ నిర్వహించే ఓటరు జాబితా సమావేశాలకు రాజకీయ పార్టీలతో పాటుగా ప్రజా సంఘాలు పాల్గొనే వెసులుబాటు కల్పించాలన్నారు. సమావేశంలో చింతపల్లి అజయ్ కుమార్ ఏపీజే విను, జి.సత్యమూర్తి, రిజాజ్ తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



సమావేశంలో అభిప్రాయం వ్యక్తం చేస్తున్న రిజాజ్

జయలక్ష్మి పాలకవర్గంతో డిపాజిటర్లకు అన్యాయం

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ నూతన పాలకవర్గం ఒంటెత్తు నిర్ణయాలతో డిపాజిటర్లు తీవ్రంగా నష్టపోతున్నారని బాధితులు వీఎస్‌వీ సుబ్బారావు, అయ్యగారి రాజగోపాలరావు, బండారు దొరబాబు, కస్తూరి రవికుమార్, బద్రీనారాయణ ఆరోపించారు. కాకినాడ అశోక్‌నగర్‌లో బాధితుల సంఘ మాజీ అధ్యక్షుడు బద్రీనారాయణ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గానికి అసలు గానీ, వడ్డీ గాని మాఫీ చేసే అధికారం లేదన్నారు. అలా చేయడం వల్ల డిపాజిటర్లు రూ.3.7కోట్లు నష్టపోవల్సి వస్తుందన్నారు. ఈ నెల 29 మహాజన సభ, ఖాళీ అయిన డైరెక్టర్ల నియామకానికి సంబంధించి సభ్యులకు పేపర్లలో ప్రకటనలు ద్వారా తెలియజేయాల్సి ఉందని, అవేమీ చేయకుండా ముందుకు వెళ్తున్నారన్నారు. రూ.లక్ష లోపు డిపాజిట్ చేసిన వారికి సొమ్ములు చెల్లించాలని భావిస్తున్నారని, దీనిపై అసలు, వడ్డీ ఇస్తారా, లేక కేవలం డిపాజిట్ సొమ్ము ఇస్తారా అనేది సందిగ్ధంగా ఉందన్నారు. దంటు కళాక్షేత్రంలో 29న జరగనున్న మహాజన సభలో నూతన పాలకవర్గాల ఆగడాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు, ఎస్పీ, డీఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు.



నూతన పాలకవర్గ ఏకపక్ష నిర్ణయాలను ఖండిస్తున్న బాధితులు

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం



మారుతీనగర్‌లోని ఒక ఇంటిలో హై ఓల్టేజీతో దగ్ధమైన ఏసీ

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మారుతీనగర్ వాసులు హై ఓల్టేజీ వల్ల విలువైన గృహోపకరణాలను నష్టపోతున్నారు. కొన్ని రోజులుగా రాత్రి పూట వస్తున్న హై ఓల్టేజీతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఇన్వెర్టర్లు దగ్ధమవుతున్నాయి. సుమారు 50 ఇళ్లలో వాటిల్లిన నష్టం దాదాపు రూ.20 లక్షల వరకు ఉంటుందని కాలనీ అధ్యక్షుడు సత్య ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు తాకేలా ఉండడంతో దసరా సెలవుల్లో ఆటలు ఆడుకునేందుకు బయటకు వెళ్తున్న చిన్నారులకు ప్రమాదం ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించడం లేదని, ప్రాణ నష్టం వాటిల్లితేనే స్పందిస్తారా అని ఆయన ప్రశ్నించారు. సమస్యను తక్షణం స్పందించాలని కోరారు.



ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

బాలాజీచెరువు: వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25లో ఉత్తీర్ణులైన ఐటీఐ విద్యార్థులకు మంగళవారం కాన్వొకేషన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులై ఉపాధి త్వరగా పొందాలనుకునే వారు ఐటీఐ అభ్యసిస్తారని, ఈ రంగంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉన్నత స్థానాలలో ఉన్నవారు రన్నారు. అత్యధిక డిమాండ్ కలిగిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వంటి కోర్సులు ఆధునిక పద్ధతుల్లో బోధిస్తున్నారన్నారు. ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు కాకినాడ ఐటీఐలో ఉండటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఐఎంసీ చైర్మన్ కె.రామకృష్ణ, ఏపీటీ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దనరావు, ప్రిన్సిపాల్ ఎంవీజే వర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీనివాసరావు

వైభవంగా పైడితల్లి జాతర

పిఠాపురం: పట్టణం మంగయ్యమ్మరావుపేటలో వెలసి న గ్రామ దేవత పైడితల్లెమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విద్యుద్దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. మంగళవారం పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

హరిద్రాదేవిగా ఐశ్వర్యాంబిక



శ్రీపీఠంలో హరిద్రాదేవి అలంకరణలో ఐశ్వర్యాంబిక అమ్మవారు

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాలలో భాగంగా రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు మంగళవారం హరిద్రాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పరిపూర్ణనంద స్వామి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన నిర్వహించారు.

ఆకట్టుకున్న తేజస్వి గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న లంక తేజస్వి

బోట్‌క్లబ్: సరస్వతీ గానసభ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో మంగళవారం విజయవాడకు చెందిన లంక తేజస్వి గాత్ర కచేరీ జనరంజకంగా సాగింది. ధన్యాసి రాగంలో నిఖిల లోక నాయకి వర్ణంతో ప్రారంభించి, వీణవాదిని రాగంలో దీక్షితుల వారి గణేశాత్సరం, త్యాగరాజు స్వామి వారి బంటురీతి కొలువియ్యవయ్యరామ వంటి కీర్తనలు గానం చేసి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. ఆమె గాత్రానికి వయొలిన్‌పై అంబటిపూడి కామాక్షి, మృదంగంపై కార్తికేయ, ఘటంపై సరస్వతుల హనుమంతరావు సహకారం అందించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సరస్వతీ గాన సభ గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, సభ్యులు పేపకాయల రామకృష్ణ ప్రారంభించారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కరప: మహిళల ఆరోగ్య పరిరక్షణకు నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కానూరి రమాదేవి అన్నారు. మండలం గొర్రిపూడిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.అనూష, డాక్టర్ కె.సింధు, పీవీ రమణమూర్తి వైద్య సిబ్బందితో కలసి మహిళలను పరీక్షించి వ్యాధులు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు, పుణ్యమంతుల అన్నవరం తదితరులు పాల్గొన్నారు. కరపలో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ వి.ఏంజలిన్, డాక్టర్ అఫ్రోజ్ వైద్యపరీక్షలు నిర్వహించారు.

వాకలపూడి పంచాయతీ కార్యాలయం వద్ద..

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి పంచాయతీ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులకు శిబిరంలో అందించే సేవలను పండూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వివరించారు.


అమ్మ నామమే అన్నింటా..

- నగరంలో అమ్మవారి ఆలయాలు కిటకిట
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- వివిధ రూపాలలో అమ్మ దర్శనం

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలత్రిపుర సుందరి ఆలయంలో ఊయల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గాయత్రి గాన మంజరి వారి కీర్తనలు, అనంతరం హరిహర నృత్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. దాతల సహకారంతో ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులు అన్నదానం నిర్వహించారు. మాధవనగర్‌లోని కనకదుర్గ అమ్మవారు జపమాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ కార్యదర్శి ఎస్‌వీ సాయిబాబా పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో నవావరణార్చన, కుంకుమ పూజ నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక సంతచెరువు కనకదుర్గమ్మ అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



ఊయల అలంకరణలో సూర్యారావుపేట బాలత్రిపుర సుందరి అమ్మవారు



విజయలక్ష్మీదేవి అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు

కరపలో..

కరప: మండలంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక దుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొంపెల్ల చక్రధర్, శివాలయంలో పర్వతవర్ధినీదేవి అమ్మవారిని ఊయల అవతారంలో అలంకరించి అర్చకులు విలపర్తి శ్రీనివాస్, విష్ణ్వాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు, ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. మహిళలు వేకువజామునే లేచి మంగళస్నాన మాచరించి దుర్గాదేవి ఆలయాలకెళ్లి కుంకుమార్చన చేయించుకున్నారు.



జపమాల అలంకరణలో మాధవనగర్ కనకదుర్గ అమ్మవారు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రీ దేవిగా..



గాయత్రిదేవిగా సంత చెరువు కనకదుర్గమ్మ తల్లి



కరప శివాలయంలో ఊయల అవతారంలో పర్వతవర్ధినీదేవి